అదిఅంత తీవ్రరూపాన్ని దాల్చియుండలేదు. ధనికుల స్వంత ద్రవ్యముపైనే ఫాక్టరీల నిలకడ ఆధారపడిన కాలములో పెట్టుబడిదారులకు కార్మికులకు మధ్య సంరంభము తప్పలేదు. క్రమముగా పరిపాలక వర్గములో మార్పులు రావడమువల్ల, ధనికులనుండి మధ్యతరగతి గుంపుల ప్రతినిధులకు అధికారము సంక్రమించగా, పెట్టుబడిదారుల లాభముకాకుండా పరిశ్రామికుల క్షేమము లక్ష్యమైనది. ఈ పోరాటము పూర్తిగా నశించాలంటే పరిశ్రమలు ఫాక్టరీలు వ్యక్తుల ఆస్తిగా కాకుండా దేశము అంతకు చేరినవిగా మారవలెననే ఆదర్శము అంగీకృతమైనది. అదేవిధంగా పంటపండే భూమి దేశమునకు చెందినది. కాని వ్యక్తులకు చెందినది కాదనిన్నీ, పంట పండించేవారికి చెందవలసిన భాగముపోగా మిగిలినది దేశసంపదక్రింద పరిగణింప బడవలెననిన్నీ ప్రచారమిప్పుడు నలుదిక్కుల మ్రోగుతున్నది. ఈ మార్పువలన వ్యక్తి స్వాతంత్ర్యము అడ్డులేకుండా విజృంభిస్తూ ఉండగలదని ఆశ. స్వాతంత్ర్యము పరమపురుషార్థమనే మతమునకు ఇది ఇష్టముగదా!

స్కెచ్

# వాయిదా వేసిన సౌఖ్యం

పావనరాం

అవి మేం స్కూల్ ఫైనల్ చదువుకొనే రోజులు. భావినిగురించి ఎక్కువగా ఆలోచించి, వర్తమానంలో బాగా చదువుతేనే కాని ఎందుకూ మారం—అనేటటువంటిభావాలు మస్తిష్కాల్లో ఏమాత్రంచోరబడ్లేదు. ఏదోసరదాగా పుస్తకాలు పుచ్చుకొని స్కూలుకి పోతూండడం, ఆటలు పాటల్తోటి కాలక్షేపం చేయడంతో సరిపోతూ ఉండేది. మే మెవరమూ మా చదువుని ఏమంత ప్రధాన కార్యంగా పరిగణించే వాళ్ళం కాదు.

ఆ రోజుల్లో మా దృష్టిలో పడ్డవాడు మా రామారావు. మనిషి చాలాబిగువుగా ఉండేవాడు. అంత చిన్నవయసులోనే—"ఈ ప్రపంచ భారం అంతా నేనే మోయాలి కా మోసు"అన్నట్టు—అతని కళ్ళెప్పుడూ భైంగగా ఉండేవి. ఏ ఫుట్‌బాల్‌మాచ్ అన్నా, డ్రామా అన్నా మేం పరిగెత్తేవాళ్ళం. కాని చస్తే రామారావు వచ్చేవాడు కాదు. అప్పుడు కూడా సాయంకాలం అతను "ఆప్షనల్ మ్యాథమాటిక్స్"లో రైడర్లు, వర్కు చేస్తూండడం నాకిప్పటికీ బాగా జ్ఞాపకం.

ఖర్మం ఏమిటీ అంటే నేనూ వాడూ మాంఛి స్నేహితులం. అలాగని వాడు చదువు మాని ఎప్పుడూ నాతో తిరిగేవాడు కాదు. వాడి తీరిక సమయాల్లో నాతో చాలా "ఫ్రీ"గా మాట్లాడేవాడు. ఈ స్నేహాన్ని ఆధారంగాతీసుకొని ఓ నాడన్నాను—

"ఏంరా! నువ్వెప్పుడూ చాలా చింతనలో ఉంటావు? ఇప్పటినుంచీ ఈ వెధప చదువుకోసం ఇంత బాధపడితే—ముందుముందసలు నీకు స్నానపానాదులకైనా టైం ఉండదు."

అంటే వాడు చాలా సీరియస్‌గా మొఖం పెట్టి "నాకూ మీలాగే సరదాగా తిరగాలని ఉంటుంది. కాని ఈ ఏడు మనం సంపాదించే మార్కులమీదే మన జీవితాలాధారపడతాయి. ఇంటర్‌లోచూడు నేనూ చాలా హుషారుగా ఉంటా"నన్నాడు.

వీడి ఉద్దేశాలకి నేను చాల ఆశ్చర్యపడ్డాను. లోలోపల వాణ్ణి చాలా అభినందించానుకూడా.

* * *

మా స్కూల్‌కి ఫస్టుగా స్కూల్ ఫైనల్ పాసయ్యాడు రామారావు. నాకూ బాగానే వచ్చాయి మార్కులు. ఇద్దరం మా ఊళ్ళోనే ఇంటర్‌లో చేరాం. ఇంటర్ అనగానే "ఫస్ట్ ఇయర్" చాలా సరదాగా కాలక్షేపం చేయవచ్చనే అభిప్రాయం నాలో చాలామంది కలగజేసారు.

ఓనాడు మావాడు స్కూల్ ఫైనల్‌లో అన్న మాటలు జ్ఞాపకం వచ్చాయి. వాడు ఇంకా మా "డ్రామా" క్లాసులు ప్రారంభించక పూర్వమే "జూలియస్ సీజర్" అంతా అప్పగించేవాడు. అంటే వాడు ఎంత "హుషార్"గా ఉంటున్నాడో మీకు బోధపడే ఉంటుంది. నేను మళ్ళీ వాడితో నా పూర్వప్రస్తావన తెచ్చాను.

"బలేగా ఆనందిస్తున్నావే లైఫ్‌ని?" అన్నాను.

"ఫస్టుఇయర్ చదవకపోతే, సెకండ్ఇయర్ ఒంటిగంటవరకూ చదివినా లాభంలేదు. ఈ ఏడాది బాగా చదివి వచ్చేఏడాది, మీరంతా పుస్తకాల్లో చస్తున్నప్పుడు నేను హాయిగా సినిమాలకి పోతుంటాను" అన్నాడు.

వీడెక్కడో దేవాంతకుడురా బాబూ అనుకున్నాను. ఆఖరికి ఫస్టుఇయర్ ఎండాకాలంలో కూడా వాడు సాయంత్రం "వెంకటాచారి" పారాయణం చేస్తూండడం నేను చాలాసార్లు గమనించాను.

వస్తుందనుకున్న "సెకండ్ ఇయర్" వచ్చింది. మావాడిలో మార్పు పూజ్యం. ఐనా వాణ్ణి ఏడిపిద్దామని—

"చాలా హాయిగా తిరుగుతున్నావు కదూ? ఎన్ని సినిమాలు చూశావు రామూ?" అన్నాను. మేంఅంతా నాలుగైదుసార్లు చూసిన, "చండీదాస్" వాడసలు చూడనేలేదు.

దానికి వాడి సమాధానం ఇది:

"ఇంటర్ సీనియర్‌లోనే మన "ఫ్యూచర్" ఆధారపడుతుంది. ఇది మన లైఫ్‌లో టర్నింగ్ పాయింట్. దీని తర్వాత ఇంక బాధపడ నవసరంలేదు. అప్పుడు నేను జీవిత మాధుర్యాన్ని సంపూర్తిగా ఆస్వాదిస్తా"నన్నాడు.

"వట్టి ఐడియలిస్టు విరా!" అన్నాను.

* * *

ఇంటర్‌లో వాడికి 570 నాకు 512 వచ్చాయి. ఇద్దరంకూడా అనుకోకుండా "కెమెస్ట్రీ ఆనర్సు"లో చేరాం. యూనివర్సిటీలో చేరగానే, గాలి మారుతుంది. ఆదివరకు చొక్కాపైన వేస్తున్నవాడు, అరసూట్‌లోకి దిగుతాడు. (అవి మారోజులు లెండి! ఇప్పుడు హైస్కూల్లోనే ఫుల్‌సూట్లతో వస్తున్నారు కుర్రాళ్లు) సిగరెట్లు, సినిమాలు చెప్పనవసరంలేదు. జేబులోఒక దువ్వెన్న సర్వదా ఉండాలి.

ఈ మార్పుల తరంగాల్లో నేను సగం మునుగుతూ, సగం తేలుతూఉన్నా, మా రామారావు మాత్రం ఒక్క కాలేనా ఈ నీళ్ళల్లో పెట్టలేదు.

ఎలాగా పాసయ్యే, "జర్మన్"కి కూడా ఒక నోట్సు వ్యవహారమూనూ. లైబ్రరీకి వెళ్ళి "జర్మన్"లో ఇదివరకటి పరీక్షా ప్రశ్నలు ఎక్కించి పారేశాడు మావాడు.

ఇంగ్లీషు సరేసరి. "రామచంద్రరావు" నోట్సు (గిరీశం అన్న "కుప్పుస్వామయ్యర్" మేడ్ డిఫికల్టు లాంటిది) ఈ మూలనుంచి ఆ మూలకి వేద పారాయణం చేసేవాడు.

"కాలిక్యులస్"ఏదో చిన్నది"రామ్‌సే" మా పాఠ్యగ్రంథం. వీడు "మెయిన్ ఆనర్సు" వాళ్ళ పుస్తకాలుతెచ్చి వర్కు చేసేవాడు. వాణ్ణి చూసి నేను ఆక్షేపిస్తూ ఉండేవాణ్ణి. పైగా మా క్లాస్‌మేట్స్ ముందు కూడా ఆక్షేపించేవాణ్ణి. ఈ రెండో పనికిమావాడు నామీద మండిపడిపోయేవాడు (కిందటికో యిల్లాలు మొగుడుకొట్టినందుకు కాక తోటికోడలు నవ్వినందుకు ఏడ్చిందట.)

నేను అడగకుండా వాడే అన్నాడోనాడు:

"నువ్వు వేళాకోళం చేస్తున్నావుకాని— ఈ మూడేళ్ళలోనూ మనకి యీ ఏడాదే చాలాకష్టం. ఎంచేత అంటే ఏ ఇతర ఆనర్సు వాడూ రాయని మూడు పేపర్లు (ఇంగ్లీషు, జర్మన్, కాలిక్యులస్) మనకి ఈ ఏడే ఉన్నాయి. మొదటి ఏడు సరదాలో పడితే ఏదో ఒకటి క్షవరం అవుతుంది. అది ఎంత ఇన్‌సల్టు? ఇంక ఫోర్తానర్సు అంటావా నా ఫిజిక్సు ఒకటే కనక పైలా పచ్చేసుగా తిరగవచ్చు. తిరగాలి కూడానూ" అని సుదీర్ఘోపన్యాసం దంచేశాడు.

థర్డ్ ఆనర్సులో అన్నీ పాసయ్యాము.

సరే "ఫోర్తు ఆనర్సు"లో కూడా మావాడు బాధపడ్డాడని వేరే చెప్పక్కర్లేదు.

కాని ఎప్పుడూ మాత్రం "నెక్స్ట్ ఇయర్ చూడరా నేనెంత ఉత్సాహంగా ఉంటానో" అంటూండేవాడు. చివరకి 'ఫైనల్ ఇయర్' వచ్చింది. ఎలాంటివాడూ ఆ ఏడు పూర్తిగానో, లేక కనీసం అయిదు నెలలేనా చాలా కష్టపడుతాడు.

మావాడు ఇకను పుస్తకాలకి మంగళసూత్రం కట్టేశాడు.

ఆ ఏడు "ఏం ఎంజాయ్ చేశావని" అడిగే పరిసితిలో లేను నేను.

* * *

ఆనర్స్ అయింది.

రామారావు "యూనివర్సిటీ ఫస్ట్" వచ్చాడు. నాకు "సెకండ్ క్లాసు" మాత్రం వచ్చింది.

వాళ్ళదేమంత ఉన్న కుటుంబం కాదు. కనుక వాడు మా ఊళ్ళోనే 'కాలేజీలో డెమాన్స్ట్రేటర్'గా ఉంటున్నాడు. దసరా సెలవుల్లో మా ఊరు వెళ్ళాను. అప్పటికింకా వాళ్ళ కాలేజీ మూయలేదు.

ఓనాడు ప్రొద్దుటే వాడింటికి వెళ్ళాను.

వాడు సీరియస్‌గా 'సాల్ట్ ఎనాలసిస్' టేబిలు వేస్తున్నాడు.

"ఓరి దౌర్భాగ్యుడా" అనుకున్నాను.

నన్ను చూడగానే వాడు కూర్చోమని, సోది మొదలెట్టాడు.

అది ఫస్ట్ ఇయర్‌ట. బాగా చదివి, చెప్తేనే కాని స్టూడెంట్సులో 'పాప్యులారిటీ' రాదట. ఆ తర్వాత దారిలోపడ్డాక బెంగ ఉండదట. ఇదీ వాడి మాటల సారాంశం.

"చూడరా నెక్స్ట్ ఇయర్ నేను లెక్చరర్ అవుతాను. అప్పుడు కుర్రాళ్ళకి నాలుగు లెక్కలిచ్చి హాయిగా పడుక్కుంటాను." అని ముగించాడు. (మేం చదువుకుంటున్నప్పుడు లైఫ్ ఎంజాయ్, చేయడం అంటే పడుకోవడమనే అనుకుంటూండే వాళ్ళం.)

* * *

క్రమంగా మా వాడికి పెళ్ళయింది. పెళ్ళికి వెళ్ళలేకపోయాను. అయినా వాడి ఉత్తరాలు బట్టి వాడి భార్య అందమయినదనీ, ఉత్తమురాలనీ గ్రహించాను. ఇంకో రెండేళ్ళమాట.

అన్నట్టు వాడు లెక్చరర్ అవనూఅయ్యాడు. రాత్రి ఒంటి గంట వరకూ లెక్చర్ నోట్సు తయారుచేసేవాడని వినికిడి.

ఎపుడేనా కనబడితే మాత్రం, "చూడ్రా, ఒక్క ఏడు ఓపిక పట్టు; నన్ను మీరంతా ద్వేషించేలాగ నేను లైఫ్‌ని ఎంజాయి చేస్తా"నన్నాడు.

వీడాఖరికి తన భార్యని ఒకసారేనా సినిమాకి తీసుకొని వెళ్ళలేదుట. (అదివాడేనాకురాశాడు.)

* * *

కాలచక్రం దొర్లుకుంటూ పోయింది. చిన్నతనంలో ఊహించుకున్న వసంతాలు ఎడారులయ్యాయి. మధురస్వప్నాలు స్వప్నాల్లాగానే ఉండిపోయాయి. మా రామారావుకి ఇద్దరు ఆడపిల్లలు, ఇద్దరు మొగపిల్లలూనూ.

ఓసారి స్టేషనులో కనిపించాడు. మనిషి బాగా చిక్కాడు. చిన్నప్పటి బింకం, బిగువూ లేదు. చాలా తేలిపోయాడు. యథాలాపంగా మాట్లాడుతూ, మొదటి కూతురు పెళ్ళి ఎంత కష్టపడి చేశాడో చెప్పాడు. ఉన్న రెండెకరాలూ తాకట్టు పెట్టాడుట. పాపం జాలేసింది వాణ్ణిచూస్తే. చదివిన ఇరవై ఏళ్ళూ రక్తం ధార పోసి చదివి, ఎప్పుడో ఒకప్పుడు జీవితానుభూతిని పొందుదామనుకున్న వాడి మొగము నేడు నిర్జీవమయింది. ప్రస్తుతం వాడు రెండో పిల్ల పెళ్ళికోసం తిరుగుతున్నాడుట. "ఏంరా! ఎంజాయిమెంట్ ఎంత వరకు వచ్చింద"ని, నాకు (వాడి స్థితి చూచాక) అడగ బుద్ధి వేయలేదు.

కాని వాడికి నా ప్రశ్న జ్ఞాపకం ఉంది. అందుకనే లాగుంది నేను రైలెక్కుతూంటే అన్నాడు:

"ఈపిల్ల పెళ్లయ్యాక నాకు యింకే బెంగా లేదురా. అపుడే నా ప్రాణం హాయిగా ఉంటుంద"న్నాడు. అక్కడికా ఉన్న మొగాళ్ళు వాడి నెత్తిమీద రాయి పెడతారని ఆశిస్తూనూ.

రైలు కదిలిపోయింది. ఇంకా వాడి పాడి మొహం, లోతు కళ్ళు, చిక్కిన దవడలు, నా హృదయంలో మెదుల్తూనే ఉన్నాయి.

ఎక్కడో దూరపు కొండల్లో సౌఖ్యరాసులున్నాయనుకోవడం అవివేకం; పోల్చుకోగలిగితే, అనునిత్యం నీకాళ్ళక్రింద సౌఖ్యం ఉండనేఉంది.—ఒపెన్‌హేమ్

చచ్చిపోయాక స్వర్గంలో సౌఖ్యం అనుభవించడానికి కొన్నిటిలో నమ్మకం ఉంటేచాలు; ఇక్కడ సౌఖ్యంకావాలంటే కష్టపడిపనిచెయ్యాలి.—చార్లొటీ గిల్‌మన్